వరదలపై గవర్నర్ సమీక్ష.. తమిళ నాడు సర్కారు బాయ్‌కాట్

చెన్నై, డిసెంబర్ 19: భారీ వర్షాలతో అతలాకుతలమైన తమిళనాడులో గవర్నర్ ఆర్ఎన్ రవి మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశాన్ని స్టాలిన్ ప్రభుత్వం బహిష్కరించింది. వరదల సందర్భంగా ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ చేపడుతున్న రక్షణ, సహాయ కార్యక్రమాలపై సమీక్షించడానికి గవర్నర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి ప్రభుత్వం నుంచి ఎవరూ రాలేదని రాజ్‌భవన్ ఓ ప్రకటనలో తెలిపింది. బాధిత ప్రాంతాల్లో బలగాలను దించి సహాయ కార్యక్రమాలు చేపట్టాలని, అవసరమైతే తాను కేంద్రంతో మాట్లాడి అదనపు సిబ్బందిని తెప్పిస్తానని గవర్నర్ సమావేశంలో హామీ నిచ్చారు. ఇటీవల పలు అంశాలలో గవర్నర్, అధికారంలోని డీఎంకే ప్రభుత్వం మధ్య కోల్డ్‌వార్ నడుస్తున్న క్రమంలోనే గవర్నర్ సమీక్షా సమావేశానికి అధికారులెవ్వరూ హాజరు కాలేదని తెలుస్తున్నది.

అక్రమాస్తుల కేసులో దోషిగా తమిళనాడు మంత్రి మద్రాస్ హైకోర్టు తీర్పు

చెన్నై, డిసెంబరు 19: రూ.1.75 కోట్లు అక్రమంగా కూడబెట్టారన్న కేసులో తమిళనాడు ఉన్నత విద్యా శాఖ మంత్రి కే పొన్ముడి, భార్య పీ విశాలాక్షిని మద్రాస్ హైకోర్టు దోషులుగా తేల్చింది. డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ దాఖలు చేసిన అప్పీలుపై జస్టిస్ జీ జయచంద్రన్ తీర్పునిస్తూ మంత్రి, ఆయన భార్యను దోషులుగా నిర్ధారించారు. డిసెంబర్ 21న కోర్టులో లొంగిపోవాలని, అనంతరం శిక్షపై తీర్పు వెల్లడిస్తామని తెలిపారు. ఈ క్రమంలో గతంలో వారిని నిర్దోషులుగా పేర్కొంటూ విల్లుపురం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు కొట్టివేసింది.

ఎన్ఐఏ చేతికి సుఖ్‌దేవ్ హత్య కేసు

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: కర్ణిసేన చీఫ్ సుఖ్‌దేవ్ గోగమెడి హత్య కేసు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ మంగళవారం అప్పగించింది. సుఖ్‌దేవ్ హత్యలో ప్రముఖ గ్యాంగ్‌స్టర్ల ప్రమేయం ఉన్న నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు కోసం కేసును ఎన్ఐఏకి అప్పగించినట్టు తెలుస్తున్నది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో తన నివాసంలో కర్ణిసేన చీఫ్‌ను ఈ నెల 5న ముగ్గురు ఆగంతకులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. కర్ణిసేన చీఫ్ హత్యకు తానే బాధ్యుడినని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధం ఉన్న గ్యాంగ్‌స్టర్ రోహిత్ గోదారా ప్రకటించుకున్నారు.

నవలఖాకు బెయిల్

ముంబై, డిసెంబర్ 19: ఎల్గార్ పరిషద్-మావోయిస్టు సంబంధాల కేసులో సామాజిక కార్యకర్త గౌతమ్ నవలఖాకు బాంబే హైకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. అయితే సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకోవడానికి బెయిల్ ఉత్తర్వుల అమలుపై ఆరు వారాల పాటు స్టే విధించాలని ఎన్ఐఏ కోరింది. స్పందించిన జస్టిస్ ఏఎస్ గడ్కరీ నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వులపై మూడు వారాల పాటు స్టే విధించింది. ఎల్గార్ పరిషద్ కేసులో నవలఖాను ఎన్ఐఏ 2018, ఆగస్టులో అరెస్టు చేసింది. ఆ తర్వాత ఆయన హౌస్ అరెస్టులో ఉండేందుకు సుప్రీంకోర్టు గత ఏడాది నవంబర్‌లో అనుమతించింది. ప్రస్తుతం నవలఖా నవీ ముంబైలో ఉంటున్నారు.

లావాదేవీలు లేని 20% జన్‌ధన్ ఖాతాలు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి జన్ ధన్ యోజన (పీఎంజేడీవై) ఖాతాల్లో 10.34 కోట్ల ఖాతాలు నిష్ప్రయోజనంగా మిగిలిపోయాయని కేంద్ర ప్రభుత్వం మంగళవారం తెలిపింది. వీటిలో 4.93 కోట్ల ఖాతాలు మహిళలకు చెందినవని తెలిపింది. రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలను కేంద్ర మంత్రి భగవత్ కే కరద్ లిఖితపూర్వకంగా తెలిపారు. బ్యాంకుల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం, డిసెంబరు 6నాటికి 51.11 కోట్ల జన్ ధన్ ఖాతాలు ఉన్నాయని, వీటిలో దాదాపు 20 శాతం అంటే, 10.34 కోట్ల ఖాతాల్లో లావాదేవీలు జరగడం లేదని చెప్పారు. బ్యాంకింగ్ రంగంలో ఈ విధంగా లావాదేవీలు లేని ఖాతాలు కూడా దాదాపు ఇదే స్థాయిలో ఉన్నాయన్నారు. లావాదేవీలు లేని జన్ ధన్ ఖాతాల్లో రూ.12,779 కోట్లు ఉందని చెప్పారు. ఈ సొమ్ముకు యథావిధిగానే వడ్డీ చెల్లిస్తారని, ఖాతాను పునఃప్రారంభించిన తర్వాత ఈ సొమ్మును, వడ్డీని ఖాతాదారులు తీసుకోవచ్చునని చెప్పారు.

మరో 49 మంది ఎంపీలపై వేటు

పార్లమెంట్‌లో సస్పెన్షన్ల పరంపర

- ఇప్పటివరకూ ఉభయ సభల్లో 141 మంది విపక్ష ఎంపీల సస్పెన్షన్
- లోక్‌సభ నుంచి 2/3 వంతు ఇండియా కూటమి ఎంపీలు ఔట్
- ఇది డెమోక్రసీని నమోక్రసీ చేసే కుట్ర
- ఉత్తరకొరియా అసెంబ్లీలా పార్లమెంట్
- విపక్షాలను గెంటేసి బిల్లులకు ఆమోదం
- ప్రతిపక్ష సభ్యుల తీవ్ర ఆగ్రహం.. పార్లమెంట్ ముందు నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: భద్రతా ఉల్లంఘన ఘటన పార్లమెంటును కుదిపేస్తున్నది. ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటన చేయాలని ఉభయసభల్లో ప్రతిపక్ష ఎంపీలు పట్టుబడుతున్నారు. అయితే ఆందోళన చేపడుతున్న విపక్ష ఎంపీలపై కేంద్ర ప్రభుత్వం సస్పెన్షన్ కొరడా ఝుళిపిస్తున్నది. వరుసగా ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేస్తున్నది. తాజాగా మంగళవారం లోక్‌సభ నుంచి మరో 49 మంది ఎంపీలను సస్పెండ్ చేసింది. దీంతో ఇప్పటివరకూ ఉభయసభల నుంచి సస్పెన్షన్‌కు గురైన ఎంపీల సంఖ్య 141కి చేరింది. ఈ నెల 14న 14 మంది ఎంపీలను (లోక్‌సభ 13, రాజ్యసభ 1) సస్పెండ్ చేయగా, సోమవారం ఒక్కరోజే 78 మందిపై (లోక్‌సభ-33, రాజ్యసభ-45) వేటు వేసిన సంగతి తెలిసిందే. ఒక్క లోక్‌సభలోనే 95 మంది ఎంపీలు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇండియా కూటమి లోక్‌సభ ఎంపీల్లో దాదాపు మూడింట రెండొంతుల మంది ఎంపీలపై వేటు పడింది. ఇండియా కూటమికి లోక్‌సభలో 138 మంది ఎంపీలు ఉండగా.. సస్పెన్షన్ల తర్వాత 43 మంది మాత్రమే మిగిలారు.

ఆందోళన నడుమే లోక్‌సభ ముందుకు నేర న్యాయ బిల్లులు

మంగళవారం సస్పెన్షకు గురైన వారిలో ఎన్‌సీఎంపీ ఫరూక్ అబ్దుల్లా, కాంగ్రెస్ ఎంపీలు శశి థరూర్, మనీశ్ తివారీ, కార్తి చిదంబరం, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్, ఎన్సీపీ, డీఎంకే, జేడీయూ, ఆప్ పార్టీలకు చెందిన ఎంపీలు ఉన్నారు. వీరి సస్పెన్షన్‌పై పార్లమెంటరీ వ్యవహారాలను శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తీర్మానం పెట్టగా.. సభ ఆమోదించినట్టు స్పీకర్ ప్రకటించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం కారణంగానే విపక్ష పార్టీల ఎంపీలు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని జోషి ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ నెల 13న ఇద్దరు దుండగుడులు పార్లమెంటులోకి ప్రవేశించి అలజడి సృష్టించిన విషయం తెలిసిందే. ఈ భద్రతా వైఫల్యంపై కేంద్ర హోంమంత్రి పార్లమెంటులో ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు ఉభయ సభల కార్యకలాపాలను అడ్డుకొంటున్నారు. దీంతో వారిని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ సస్పెండ్ చేస్తున్నారు. కాగా, మంగళవారం లోక్‌సభలో గందరగోళ పరిస్థితుల మధ్యనే పలు సవరణలతో కూడిన మూడు నేర న్యాయ బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

బీజేపీ ఎంపీపై చర్యలేవీ?

ఎంపీల వరుస సస్పెన్షన్‌పై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. ప్రభుత్వం డెమోక్రసీ (ప్రజాస్వామ్యం)ని నమోక్రసీ (నరేంద్రమోదీకరణ) చేసే కుట్రలకు పాల్పడుతున్నదని కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. 'సస్పెండ్ చేయడం, గెంటివేయడం, బుల్డోజ్ చేయడం'ను కేంద్ర ప్రభుత్వం పాలసీగా పెట్టుకొన్నదని విమర్శించారు. విపక్షాన్ని పూర్తిగా సభ నుంచి గెంటేసి అత్యంత కీలక బిల్లులను ప్రభుత్వం ఆమోదింపజేసుకొంటున్నదని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. పార్లమెంటు భద్రత గురించి ప్రశ్నించిన ఎంపీలను సస్పెండ్ చేస్తూ.. దుండగులను పార్లమెంటులోకి తీసుకొచ్చిన బీజేపీ ఎంపీకి మాత్రం సకల సౌకర్యాలు కల్పిస్తున్నదని మండిపడ్డారు.

సస్పెన్షన్లపై విపక్ష ఎంపీల ఆందోళన

ఎంపీల సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా విపక్ష పార్టీలు మంగళవారం ఉదయం పార్లమెంట్ భవనం వద్ద మాక్ పార్లమెంట్ నిర్వహించి నిరసన తెలిపాయి. టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్‌ను హేళన చేశారని ఆరోపిస్తూ బీజేపీ విమర్శలు గుప్పించింది. ఇది సిగ్గుచేటు అని, రైతుగా తన నేపథ్యానికి కూడా అవమానకరమని ధనకర్ సభలో పేర్కొన్నారు. మంగళవారం 49 మంది ఎంపీల సస్పెన్షన్ అనంతరం శిరోమణి అకాలీదళ్ ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. బీజేపీ పాలనలో పార్లమెంట్ రాజ్యాంగ శ్మశానంగా మారిందని వ్యాఖ్యానించారు. విపక్ష ఎంపీలను పార్లమెంట్‌లో ప్రశ్నలు లేవనెత్తనీయకుండా వారిని బమటకు వెళ్లగొడుతున్నారని, ఇదేనా మోదీ సర్కార్ చెప్పే 'నూతన భారత్' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం మాట్లాడుతూ పార్లమెంట్ త్వరలో ఉత్తర కొరియాను తలపిస్తుందని అన్నారు. ప్రధాని మోదీ సభలోకి వచ్చే సమయంలో చప్పట్లు కొట్టడం మాత్రమే మిస్ అవుతుందని, ఇది టోకెన్ హౌస్‌గా మారనున్నదని వ్యాఖ్యానించారు.

ప్రతిపక్షాలు మళ్లీ అక్కడే: మోదీ

ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత మరింత కుంచించుకుపోయి మళ్లీ ప్రతిపక్షంలోనే ఉంటాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. మంగళవారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ప్రతిపక్ష పార్టీల సభ్యులు వారి చర్యల ద్వారా పార్లమెంటు భద్రతకు భంగం కలిగించినవారికి పరోక్షంగా సహకారం అందిస్తున్నాయని ఆరోపించారు. పార్లమెంట్ కార్యకలాపాలను విపక్షాలు పదే పదే అడ్డుకొంటున్నాయని, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమి నిరుత్సాహంతో పార్లమెంట్ ఘటనకు విపక్షాలు రాజకీయ రంగు పులుముతున్నాయని విమర్శించారు. వారి లక్ష్యం తమ ప్రభుత్వాన్ని కూలదోయడమేనని, అయితే తమ లక్ష్యం భారత్‌ను మెరుగైన భవిష్యత్తు దిశగా నడపించడమని మోదీ అన్నారు.



విపక్ష సభ్యుల సస్పెన్షన్ అనంతరం ఖాళీ కుర్చీల మధ్యే కొనసాగుతున్న లోక్‌సభ కార్యకలాపాలు

భయంకరంగా పార్లమెంట్ వాష్‌రూమ్‌లు

ఎంపీ జయాబచ్చన్ విమర్శ

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: పార్లమెంట్‌లో పలువురు విపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు విధించడంపై నేతలు నిరసన వ్యక్తం చేయగా, సమాజ్‌వాదీ ఎంపీ జయాబచ్చన్ తోటి సభ్యులకు మద్దతుగా వాకౌట్ చేసిన సందర్భంగా పార్లమెంట్‌లో ఒక కొత్త సమస్య గురించి ప్రస్తావించారు. పార్లమెంట్ వాష్‌రూమ్‌లు భయంకరంగా ఉన్నట్టు చెప్పారు. పార్లమెంట్ బయట ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సభలో మాట్లాడేందుకు తనకు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. ఎలాంటి చర్చ జరపకుండా బిల్లులు ఆమోదించడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నదన్నారు. ఈ విషయంలో వారు అనుచిత, అన్యాయ విధానాలను అవలంబిస్తున్నారన్నారు.

ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిగా ఖర్గే?

మమతా బెనర్జీ, కేజ్రీవాల్ ప్రతిపాదన

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విపక్ష ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే పేరును పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రతిపాదించారు. మంగళవారం ఢిల్లీలో విపక్ష ఇండియా కూటమి సమావేశం జరిగింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష ఇండియా కూటమి గెలిస్తే, ఖర్గే మొట్టమొదటి దళిత ప్రధాని అవుతారని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అయితే ఈ అంశంపై కూటమి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. దీనిపై ఖర్గే మాట్లాడుతూ, 'అణగారిన వర్గాల కోసం పనిచేస్తున్నా. విపక్ష ఇండియా కూటమి గెలుపు సాధించటం ముఖ్యం. ప్రధాని ఎవరన్నది ఎంపీలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్ణయిస్తారు' అని అన్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విపక్ష ఇండియా కూటమి నేతలు సమావేశమవ్వటం ఇదే మొదటిసారి. సీట్ల సర్దుబాటుపై వీలైనంత త్వరగా ఖరారు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. 100 శాతం వీవీప్యాట్లను లెక్కించాలి. ఈవీఎంలపై ఇండియా కూటమి పక్షాలు అనుమానాలు లేవనెత్తాయి. 100 శాతం వీవీప్యాట్లను లెక్కించాలని డిమాండ్ చేశాయి. ఈ విషయంపై ఈసీకి మెమొరాండం ఇచ్చినప్పటికీ సమాధానం లేదని పేర్కొన్నాయి.

మహారాష్ట్ర విధాన్‌భవన్ వద్ద రైతు ఆత్మహత్యాయత్నం

నాగ్‌పూర్: మహారాష్ట్రలో రైతులు దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. మంగళవారం ఓ రైతు ఏకంగా ఆ రాష్ట్ర అసెంబ్లీ వద్ద ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. పంట నష్టం, అప్పుల భారం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన రైతు సచిన్ ఉత్తమ్ బహదురే (29) మంగళవారం నాగ్‌పూర్‌లోని మహారాష్ట్ర విధాన్ భవన్ వద్ద ఆత్మహత్యాయత్నం చేశారు. యావత్మాల్ జిల్లా, మురత్ జహంగీర్‌లో నివసిస్తున్న సచిన్ మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో సంవిధాన్ స్క్వేర్ వద్దకు చేరుకుని, తన చొక్కా క్రింద దాచిపెట్టిన పురుగుల మందు సీసాను తీసి, తాగారు. దీనిని గమనించిన పోలీసులు హుటాహుటిన స్పందించి, ఆయనను దవాఖానకి తరలించారు. ఆయనను ఐసీయూలో అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర హివ్రే చెప్పారు. ఆయన వద్ద దొరికిన లేఖలో, తాను పంట నష్టం, అప్పుల భారంతో కుంగిపోయానని పేర్కొన్నారని తెలిపారు. మహారాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు ఇక్కడ జరుగుతున్నాయి.

కులదేవత కాదు.. డైనోసార్ గుడ్డు!

లక్నో: మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. తాటికాయ సైజున్న రాతి బంతులను చాలా ఏండ్లుగా కొందరు గ్రామస్థులు కులదేవతలకు ప్రతిరూపాలుగా భావిస్తూ పూజిస్తున్నారు. ఇటీవల ఆ ప్రాంతాలను సందర్శించిన పరిశోధకులు అనుమానంతో పరీక్షలు జరుపగా షాకింగ్ నిజాలు తెలిశాయి. వారు ఇన్నాళ్లూ పూజలు జరుపుతున్నది డైనోసార్ శిలాజ గుడ్లుగా నిర్ధారించారు. ధార్, దానికి సమీపంలో ఉన్న జిల్లాల్లో పొలం దున్నేప్పుడు, ఇతర తవ్వకం పనులు చేసేటప్పుడు లభించే ఈ రాతి బంతులను కొందరు దైవంగా భావించి పూజిస్తున్నారు. ఈ బంతులను కాకర్ భైరవ్‌గా పూజిస్తున్నట్టు పండ్యాల గ్రామానికి చెందిన వెస్టా మండాలోయ్ (40 తెలిపారు. రాతి బంతులను లక్నోలోని బీర్బల్ సాహ్ని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలియోసెన్సెస్ శాస్త్రవేత్తలు పరిశోధించగా, డైనోసార్ టైటనాసార్ జాతికి చెందిన శిలాజ గుడ్లుగా తేలింది.

6 నెలల్లో తేల్చండి

- జ్ఞానవాపిపై జిల్లా కోర్టుకు అలహాబాద్ హైకోర్టు ఆదేశం
- మసీదు కమిటీ దాఖలు చేసిన పిటిషన్ల కొట్టివేత
- చివరివరకు పోరాడుతాం
- మసీదు కమిటీ స్పష్టీకరణ

ప్రయాగ్‌రాజ్, డిసెంబర్ 19: వారణాసిలోని జ్ఞానవాపి మసీదు స్థానంలో ఆలయాన్ని పునరుద్ధరించాలని కోరుతూ దాఖలైన కేసు విచారణను వేగవంతం చేయాలని అలహాబాద్ హైకోర్టు జిల్లా కోర్టును ఆదేశించింది. 1991లో దాఖలైన ఈ కేసు చట్టబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను అలహాబాద్ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. వివాదాస్పద స్థలం ఏ మతం వారికి చెందుతుందో కోర్టు నిర్ణయిస్తుందని స్పష్టం చేసింది. జ్ఞానవాపి మసీదు మేనేజింగ్ కమిటీ, ఉత్తరప్రదేశ్ సెంట్రల్ సున్నీ వక్ఫ్ బోర్డు దాఖలు చేసిన ఐదు పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. మసీదు స్థానంలో ఆలయాన్ని పునఃప్రతిష్టించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ప్రార్థనా స్థలాల చట్టం, 1991 అడ్డుకోలేదని పేర్కొంది. ప్రార్థనా స్థలాల చట్టం 1991 ప్రకారం, 1947, ఆగస్టు 15 నాటికి ఉన్న ప్రార్థనా స్థలాల స్వభావాన్ని మార్చకూడదు. అయితే ఆ చట్టం 'ప్రార్థనా స్థలాల స్వభావం' అన్న అంశాన్ని నిర్వచించలేదని, కేవలం కోర్టులు మాత్రమే సాక్ష్యాధారాల ఆధారంగా నిర్ణయిస్తాయని జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ పేర్కొన్నారు. జ్ఞానవాపి కాంపౌండ్‌కు హిందూ మత స్వభావం లేదా ముస్లిం మత స్వభావం మాత్రమే ఉండాలని, ఒకేసారి రెండు స్వభావాలను అది కలిగి ఉండలేదని వ్యాఖ్యానించారు.

హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తాం

జ్ఞానవాపి మసీదుపై అలహాబాద్ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తామని, ఆఖరి శ్వాస వరకు న్యాయం కోసం తమ పోరాటం కొనసాగిస్తామని జ్ఞానవాపి మసీదు మేనేజ్‌మెంట్ కమిటీ మంగళవారం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టులో దీనిని సవాల్ చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. దీనికి సంబంధించి కోర్టు వెలువరించిన ఆదేశాలు ఇంకా తమ చేతికంద లేదని, వచ్చిన తర్వాత దానిని మేనేజ్‌మెంట్ కమిటీతో చర్చించి బుధవారం సాయంత్రంలోగా నిర్ణయం వెలువరిస్తామని అంజుమన్ ఇంతెజామియా మసీదు సంయుక్త కార్యదర్శి సయ్యద్ మహమ్మద్ యాసిన్ చెప్పారు.

మద్యం పాలసీ కేసు బోగస్: ఆప్

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: ఢిల్లీ మద్యం పాలసీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన కేసు బోగస్, నకిలీ అని ఆమ్ ఆద్మీ పార్టీ పునరుద్ఘాటించింది. ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను విచారణకు హాజరు కావాలంటూ తాజాగా ఇచ్చిన నోటీస్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నెల 21న హాజరు కమ్మంటూ ఈడీ ఆదేశించిందని, వాస్తవానికి ఆ రోజు విపాసన కార్యక్రమానికి హాజరవుతారని,ఇది ముందుగా నిర్ణయించిన కార్యక్రమమేనని ఆ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా తెలిపారు. ఈడీ జారీ చేసిన నోటీసుపై పార్టీ లీగల్ బృందం సమాధానమిస్తుందని తెలిపారు.

కాగ్ రిపోర్టులకు కత్తెర!

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడూ ఎండగట్టే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికల సంఖ్య ఏటికేడు తగ్గిపోతున్నది. కేంద్రంలో బీజేపీ వచ్చిన 2014-2018 మధ్యలో ఏడాదికి సగటున 40 కాగ్ నివేదికలు వెలువడగా, 2019-2023 మధ్య ఇది 22కి తగ్గిపోయింది. 2023లో కేవలం 18 కాగ్ మాత్రమే వచ్చాయి. విమర్శలు బయటకు రాకుండా అధికారపక్షం వ్యవహరిస్తున్నదని విపక్షాలు మండిపడుతున్నాయి.

అద్వానీకి స్వా..గతం!

మొదటిపేజీ తరువాయి...

రాముడి ఆలయం నిర్మాణం తుది దశకు చేరుకొన్నది. వచ్చే ఏడాది జనవరిలో అంగరంగ వైభవంగా ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. అయితే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావొద్దంటూ ప్రస్తుతం బీజేపీలో పెద్దగా క్రియాశీలంగా లేని అద్వానీ, మురళీ మనోహర్ జోషిలకు ఆలయ ట్రస్టు చెప్పడం పెద్ద దుమారం రేపింది. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి కారణమైన వారినే ప్రారంభోత్సవానికి వద్దంటారా? అని పెద్దయెత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇది తమకు ప్రతికూలంగా మారే అవకాశం ఉన్నదని గ్రహించిన బీజేపీ అగ్రనాయకత్వం విశ్వ హిందూ పరిషత్‌ను రంగంలోకి దించింది. ట్రస్టు నిర్ణయంతో సంబంధం లేకుండా వీహెచ్‌పీ అధ్యక్షుడు అలోక్ కుమార్, ఇతర నేతలు మంగళవారం స్వయంగా అద్వానీ, జోషిలను వారి ఇండ్లకు వెళ్లి కలిశారు. ప్రారంభోత్సవానికి ఆహ్వానం పలికారు. అంతకుముందు ట్రస్టు రావొద్దని చెప్పడం.. తాజాగా వీహెచ్‌పీ రమ్మని ఆహ్వానం పలుకడంతో 'హాజరయ్యేందుకు ప్రయత్నిస్తాం' అని అద్వానీ, జోషీలు వారితో చెప్పినట్టు సమాచారం.

ప్రతికూలంగా మారుతుందనే భయంతో..

వచ్చే ఏడాది జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్య రామ మందిర నిర్మాణం తమకు హిందువుల ఓట్లను కుమ్మరించేలా చేస్తుందని, తద్వారా మరోసారి అధికారంలోకి రావడానికి దోహదం చేస్తుందని బీజేపీ భావిస్తున్నది. ఈ నేపథ్యంలో ఆలయ ప్రారంభోత్సవానికి అద్వానీ, జోషీలను ఆహ్వానించకపోతే అది తమకు ప్రతికూలంగా మారే ప్రమాదం ఉందని బీజేపీ అప్రమత్తం అయింది. ఆలయ ట్రస్టు నిర్ణయం వల్ల జరిగిన నష్టాన్ని నివారించేందుకు వీహెచ్‌పీని బీజేపీ అధినాయకత్వం రంగంలోకి దింపినట్టు తెలుస్తున్నది. వృద్ధాప్యం కారణంగానే అద్వానీ, జోషీలను ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావద్దని చెప్పినట్టు ఆలయ ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే. అద్వానీ వయసు 96, జోషి వయసు 90 కావడం వల్ల వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రావొద్దని కోరినట్టు చంపత్ రాయ్ వివరించారు. అయితే ఓ వైపు వయసు కారణంగా వీరిద్దరిని రావొద్దని చెప్పి, మరోవైపు 90 ఏండ్ల మాజీ ప్రధాని దేవెగౌడ, 88 ఏండ్ల దలైలామాను ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం ఏంటనే ప్రశ్నలు కూడా వస్తున్నాయి.

జనవరి 22న ప్రారంభోత్సవం

అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవ ఏర్పాట్లు వచ్చే నెల జనవరి 16 నాటికి పూర్తి కానున్నాయి. జనవరి 16 నుంచి ఆలయంలో మూల విరాట్‌ల ప్రాణ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం అవుతాయి. అనంతరం జనవరి 22న రామాలయ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు దలైలామా, మాతా అమృతానందమయి, యోగా గురువు బాబా రాందేవ్, సినీ ప్రముఖులు అమితాబ్ బచ్చన్, రజినీకాంత్, మాధురీ దీక్షిత్, అరుణ్ గోవిల్, దర్శకుడు మాధుర్ భండార్కర్, ప్రముఖ పారిశ్రామికవేత్తలు ముఖేశ్ అంబానీతో సహా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఆలయ ట్రస్టు ఆహ్వానించింది.

పాక్‌లో రివర్స్ గేర్‌లో కార్ల విక్రయాలు

నవంబర్‌లో 5 వేలలోపే అమ్మకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: పాకిస్థాన్‌లో కార్ల విక్రయాలు రివర్స్ గేర్‌లో నడుస్తున్నాయి. నవంబర్‌లో కేవలం 4,876 యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో 15,432 యూనిట్లతో పోలిస్తే 68 శాతం తగ్గుదల నమోదైనట్టు పాకిస్థాన్ ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (పీఏఎంఏ) వెల్లడించింది. దీనికి భిన్నంగా భారత్‌లో గంటకు 500 కార్లు చొప్పున నవంబర్‌లో 3.6 లక్షల కార్లు అమ్ముడయ్యాయి. రానున్న కాలంలో పాకిస్థాన్‌లో ఆటోమొబైల్ రంగం తీవ్ర గడ్డు పరిస్థితులను ఎదుర్కోనుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల ప్రముఖ అంతర్జాతీయ వాహన తయారీ కంపెనీలు టెస్లా, బీవైడీ, జీడబ్ల్యూం లాంటివి పాకిస్థాన్‌లో తమ కార్యకలాపాలకు స్వస్తి పలికి భారత్‌లో తమ మార్కెట్‌ను విస్తరించడానికి ప్రణాళికలు వేస్తున్నాయి. ఒక పక్క దక్షిణాసియాలో సైతం ఈ పరిశ్రమ మంచి పురోభివృద్ధి సాధిస్తుండగా, పాకిస్థాన్‌లో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఒడిశాలో కలరా కలకలం

ఆరుగురు మృత్యువాత

భువనేశ్వర్, డిసెంబర్ 19: ఒడిశాలోని రూర్కె